క్లుప్తంగా

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ



ముదపాక జగనన్న లేఅవుట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ దొంగిలించిన ప్రాంతం

పెందుర్తి: పెందుర్తి మండలం ముదపాక జగనన్న లేఅవుట్‌లో పలుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ఎత్తుకుపోతున్నారు. పది రోజుల వ్యవధిలో నాలుగు చోట్ల ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు పెందుర్తి క్రైం విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం విభాగం ఎస్‌ఐ సూరిబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా ఉండే కాపర్ దొంగలే ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు భావిస్తున్నారు. అక్కిరెడ్డిపాలెం సమీపంలోని పారిశ్రామిక ప్రాంతంలో కూడా ఇటీవల కాలంలో ఈ తరహా చోరీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాల భోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.1,10,116 విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం కశింకోటకు చెందిన మళ్ల భాస్కరరావు దంపతులు రూ.1,10,116 విరాళం అందజేశారు. సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలోని డోనేషన్ కౌంటరులో నగదు అందజేశారు. దేవస్థానం తరఫున పీఆర్‌వో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్ దాతకు అందజేశారు.

బొమ్మలు తయారు చేద్దాం రండి



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జానకిరామ్ చిన్నారులకు నీతి కథలను బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. బి.లక్ష్మీతేజ విద్యార్థులతో యోగాసనాలు అభ్యసనం చేయించారు. బొమ్మలు వేయడం నేర్పించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

9న మెగా జాబ్ మేళా

పెందుర్తి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 250 కంపెనీల్లో కొలువుల కోసం ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్థులు విద్యార్హత పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని.. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

20న ముత్యమాంబ అమ్మవారి పండగ

పరవాడ: మండలంలో ముత్యాలమ్మపాలెం గంగపుత్రుల ఆరాధ్యదైవంగా కొలిచే ముత్యమాంబ అమ్మవారి పండగను ఈ నెల 20న నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను పెందుర్తి నియోజకవర్గం కూటమి నాయకులు శనివారం ఆవిష్కరించారు. పండగను పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సర్పంచ్ చింతకాయల సుజాత తెలిపారు.

ఆక్రమణల బెడద ట్రాఫిక్ సమస్య





రహదారిపై మురుగు



డ్రైయిన్లు పూడికపోవడంతో రోడ్డుపై మురుగునీరు

సబ్బవరంలో ప్రజల అవస్థలు

చర్యలు తీసుకోని అధికారులు



నిత్యం రద్దీగా ఉండే సబ్బవరం మూడు రోడ్ల కూడలి

<u>సబ్బవరం:</u>

సబ్బవరం మండల కేంద్రం కావడంతో నిత్యం ప్రజలు, విద్యార్థులు, వాహనాలతో రద్దీగా ఉంటోంది. పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, వాణిజ్య సముదాయాలు ఉండటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం ఇక్కడికి వస్తుంటారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు వెళ్లే ప్రధాన జంక్షన్ కావడంతో రద్దీ మరింత అధికంగా ఉంటోంది.

మండలంలో దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, మారిటైం విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ కెమికల్ విశ్వవిద్యాల యాలు ఉండటంతో దేశం నలుమూలల నుంచి విద్యార్థులు ఇక్కడ నివాసం ఉంటున్నారు. వీరి అవసరాలకు అనుగుణంగా వాణిజ్య సముదాయాలు, హోటల్స్ పెరుగుతున్నాయి. దీంతో సబ్బవరం విస్తరిస్తున్నప్పటికీ, తగిన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, ట్రాఫిక్ సమస్యగా మారిన డ్రైన్‌లు, రోడ్లపై ఆక్రమణల తొలగింపు వంటి చర్యలు అధికారుల నుంచి కనిపించడం లేదు.

ఆక్రమణల బెడద

మండల కేంద్రంలో వాణిజ్య సముదాయాలు అధికంగా ఉండటం, భూముల విలువ పెరగడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. రోడ్డు పక్కన కొద్దిపాటి స్థలం ఉన్నా, మిగిలిన రోడ్డు, ఫుట్‌పాత్‌లు, డ్రైన్‌లను ఆక్రమించి శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఫుట్‌పాత్‌లు, డ్రైన్‌లు ఆక్రమణకు గురై రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. దుకాణాలకు వచ్చే వారు రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ మరింతగా పెరుగుతోంది.

డ్రైయిన్లపై దుకాణాలు

డ్రైన్‌లపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో మురుగునీరు, చెత్తాచెదారంతో అవి పూడిపోయి మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది. మూడు రోడ్ల కూడలిలో సైతం ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీలపై వాణిజ్య సముదాయాలు వెలిశాయి. దీంతో కాలువల నుంచి వచ్చే మురుగునీరు, ప్లాస్టిక్ వ్యర్థాలతో అవి పూడుకుపోయి, హోటళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు రోడ్లపైకి చేరుతున్నాయి.



రోడ్డుపై నిలిపివేసిన ద్విచక్ర వాహనాలు



చోడవరం రోడ్డులో డ్రైయిన్లపై ఏర్పాటు చేసిన షాపు



సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన షాపులు

పట్టించుకోని అధికారులు

సమస్య ఇంతలా ఉన్నా మండల పరిషత్ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. పంచాయతీ అధికారులు, పాలకవర్గ సభ్యులు సైతం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. గతంలో ఒకటి రెండు రోజులు హడావుడి చేసి ఆక్రమణలు తొలగించినా, మళ్లీ అవి యథావిధిగా విస్తరిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సబ్బవరంలోని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి, ఆక్రమణలు తొలగించడానికి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం



సబ్బవరంలో ఉన్న డ్రైయిన్లు అభివృద్ధి చేయాల్సి ఉంది. ఫుట్‌పాత్‌లు, డ్రైయిన్ల ఆక్రమించి ఏర్పాటు చేసిన షాపులు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకారంతో తొలగించాల్సి ఉంది. పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులతో కలిసి వారిపై చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలను తొలగిస్తాం.

–బి.పద్మజ, ఎంపీడీవో, సబ్బవరం

పొంచి ఉన్న ప్రమాదం



విజయరాంపురం రోడ్డు సమీపంలో ప్రమాదకరమైన బావి

పరవాడ: పెదముషిడివాడ–విజయరాంపురం రహదారి ప్రయాణికులకు ప్రమాదకరంగా మారింది. పెదముషిడివాడ గ్రామ సచివాలయం దాటి విజయరాంపురం వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే ఉన్న నేల బావి నిత్యం భయాందోళనకు గురిచేస్తోంది. ఈ రహదారిలో ప్రజలు, కార్మికులు, రోజువారీ కూలీలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు కూడా అధికంగా ఉన్నాయి. రాత్రి సమయంలో వాహనదారులు కొంచెం అజాగ్రత్తగా ఉన్నా, వాహనం అదుపు తప్పి నేరుగా రోడ్డు పక్కనున్న నేల బావిలో పడిపోయే ప్రమాదం ఉంది. చీకటి పడితే ఈ రహదారిలో ప్రయాణించడానికి ప్రజలు భయపడుతున్నారు. ప్రయాణికులను భయపెడుతున్న ఈ నేల బావి వద్ద రక్షణ గోడ నిర్మించాలని విజయరాంపురం గ్రామస్తులు అధికారులను వేడుకుంటున్నారు.

శరవేగంగా ఆలయ నిర్మాణ పనులు



జరుగుతున్న నిర్మాణ పనులు

పరవాడ: మండలంలో పెదముషిడివాడ శివారు నక్కవానిపాలెం గ్రామంలో సర్పంచ్ పల్లా అప్పారావు నాగమణి సౌజన్యంతో తలపెట్టిన నూకాంబిక ఆలయ నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలో నూకాంబిక ఆలయ నిర్మాణానికి సర్పంచ్ పల్లా అప్పారావు నాగమణి సొంత నిధులు రూ.15 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఆలయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకొంటున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



విద్యార్థినులకు పఠన సామగ్రి అందజేస్తున్న రిటైర్డ్ ఎస్‌ఐ త్రినాథరావు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, బాలికలకు గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత సబ్‌ఇన్‌స్పెక్టర్ గోల్కొండ్ త్రినాథరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. త్రినాథరావు మాట్లాడుతూ రోడ్డుపై నడిచేటప్పుడు, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. ఓవర్‌స్పీడ్, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేయడం అత్యంత ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. విద్యార్థినులు గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌ల గురించి తెలుసుకోవాలని, ఎటువంటి అనుమానం వచ్చినా వెంటనే తల్లిదండ్రులకు చెప్పాలని త్రినాథరావు సూచించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు పాలెపు బంగారు చిట్టి అందించిన ఆర్థిక సహాయంతో కొనుగోలు చేసిన పఠన సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్వీ నరసింహం, కార్మిక నాయకుడు సీహెచ్.సూర్యనారాయణరాజు, గ్రంథాలయ ఉద్యోగి ఎల్లమ్మ, స్థానికులు భానుమూర్తి, భవాని, లూసీ రాజేష్, శంకర్, మోహన్, హరీష్, గాయత్రి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కేసుల నమోదు



డ్రోన్ ద్వారా బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న పలువురిపై పోలీసులు శనివారం కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానం చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ నేతృత్వంలో చినముషిడివాడ, పెందుర్తి, సుజాతనగర్, వేపగుంట ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్ల ద్వారా సేకరించిన చిత్రాల ఆధారంగా నిందితులను గుర్తించారు. ఈ మేరకు మొత్తం 35 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు బహిరంగంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు



చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు కథలు చెప్పడం, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఇటువంటి పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని గ్రంథాలయ అధికారి వి.శిరీష తెలిపారు. ఈ వేసవి శిబిరంలో భాగంగా ప్రతిరోజు విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ పోటీల్లో పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ పడివి రత్నకుమారి పాల్గొన్నారు.

రామాలయంలో విశేషంగా హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో హోమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను కొలువుదీరారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పారాయణాలు జరిపారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ సేవలు అభినందనీయం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల అసోసియేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) జి.వి.ఎన్. ప్రసాద్ అన్నారు. ఉక్కు హెచ్‌ఆర్‌డీ విభాగంలో శనివారం ఆయన అసోసియేషన్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో అసోసియేషన్ పెద్ద సంఘంగా ఉండడం వల్ల కార్మికులతో పాటు అధికారులకు ఉపయోగకరమన్నారు. సభ్యుల సంక్షేమం, అభ్యున్నతికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. హెచ్‌ఆర్ జీఎంలు ఎం. మధుసూదనరావు, ఎన్. భాను మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెబ్‌సైట్, మొబైల్ యాప్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా గతేడాది డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సిల్వర్ కాయిన్లు అందజేశారు. విశ్రాంత జీఎం కె. సంజీవరావు, లైజన్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్షుబు బి. అప్పారావు, ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు, ఉప ప్రధానకార్యదర్శి కొయిలాడ శ్రీనివాస్, వై.ఎల్. నాయుడు, వి. సింహాచలం, శశిభూషణరావు, దొడ్డి సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో వేధిస్తున్న స్టాళ్ల కొరత



స్టాళ్లు సరిపోక రైతుబజార్‌లో నేల మీద అమ్మకాలు సాగిస్తున్న రైతులు

పెందుర్తి: స్థానిక రైతు బజార్‌లో స్టాళ్ల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా రు. మొత్తం 158 రైతులకు సభ్యత్వం ఉండగా బజార్‌లో కేవలం 90 మాత్రమే స్టాళ్లు ఉన్నాయి. దీంతో ఉదయం 8 తరువాత ఎండలకు, వర్షాలు పడుతున్న సమయంలోనూ తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎండలో ఎక్కువ సేపు ఉండడంతో కూరగాయలు పాడై వినియోగదారులు కొనుగోలు చేయడానికి కూడా ఆసక్తి చూపడం లేదని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్టాళ్ల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

అప్పన్నకు పెద్ద సంఖ్యలో కోడెదూడల సమర్పణ



భక్తులు వదిలివెళ్లిన కోడెదూడలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు కోడెదూడలు మొక్కుబడిగా చెల్లించారు. కొండదిగువ తొలిపావంచావద్ద వాటిని స్వామికి సమర్పించి వదిలి వెళ్లారు. దాదాపు 150 వరకు కోడెదూడలను స్వామికి సమర్పించారు. కాగా వాటిని ఏజెన్సీ ప్రాంతాల్లోని రైతులకు పూచీకత్తుపై ఇచ్చేబాధ్యతను నగరానికి చెందిన హోప్ యానిమల్ ట్రస్ట్ చేపట్టింది.

నిరుద్యోగులకు కూటమి మోసం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

పెందుర్తి: ఎన్నికల సమయంలో దేశ వ్యాప్తంగా 2 కోట్ల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చిన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దారుణంగా మోసం చేసిందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.రాంబాబు విమర్శించారు. తిరుపతి కేంద్రంగా ఈ నెల 15 నుంచి 18 వరకు జరగున్న ఎఐవైఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ శనివారం బర్ధన్‌నగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటులో ఏ మాత్రం భాగస్వామ్యం లేని బీజేపీ ఇప్పుడు ఏకంగా దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల్లో అనేక హామీ ఇచ్చి ప్రజలను దారుణంగా వంచించిందన్నారు. మహాసభల వేదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను మోసం చేసిన తీరుపై చర్చించి ప్రణాళికబద్ధంగా పోరాటం చేస్తామని చెప్పారు. ముందుగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీపీఐ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ నాయకులు పవన్, సాయి,రాజు, రాజేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె బుక్‌లెట్ ఆవిష్కరణ

పరవాడ: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈ నెల 20న దేశవ్యాప్తంగా తలపెట్టిన కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు పరవాడలో శనివారం బుక్‌లెట్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ, కార్మికుల పోరాటాల ద్వారా సాధించిన కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చే చర్యలను ప్రభుత్వం విరమించాలని డిమాండ్ చేశారు. సామాజిక భద్రత కోడ్ పేరుతో 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి, కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దీనిని నిరసిస్తూ మే 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.రమణ, రాజు, అప్పలరాజు, చిట్టిబాబు, పెంటారావు, అప్పలనాయుడు, కొండబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

కార్మికుల చేతుల్లోనే పారిశ్రామిక భద్రత



సెమినార్ ప్రారంభిస్తున్న కేంద్ర ఈఎస్‌ఐ విశ్రాంత కమిషనర్ సాహు

ఉక్కునగరం: పారిశ్రామిక భద్రత పరిశ్రమ యాజమాన్యంతో పాటు కార్మికులందరిపై ఆధారపడి ఉంటుందని కేంద్ర ఈఎస్ఐ విశ్రాంత కమిషనర్ బి.కె. సాహు అన్నారు. స్టీల్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో 'సంక్షోభాల సమయంలో ప్రమాదకర పరిశ్రమల్లో భద్రత ప్రాముఖ్యత' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. ఏడు బంగారు భద్రతా సూత్రాల ఆధారంగా ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కార్మికులు నాయకత్వం వహించడం, ప్రమాదాలను గుర్తించడం, లక్ష్యాలు నిర్దేశించడం, సురక్షమైన ఆరోగ్యకరమైన వ్యవస్థను తయారు చేయడం, యంత్రాలు, పరికరాలు, కర్మాగార, కార్యాలయాల్లో భద్రత, ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చునన్నారు. ఉక్కు భద్రతా విభాగం సీజీఎం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్లాంట్‌లో ఇటీవల జరుగుతున్న ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులంతా భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, జె. అయోధ్యరామ్, పి.వి. రమణమూర్తి, సెంట్రల్ సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కోదండ సీతారామస్వామి విగ్రహ ప్రతిష్ట

సబ్బవరం : మండలంలోని టిక్కలిపాలెం గ్రామంలో గణపతి, వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవతా సహిత, కోదండ సీతారామస్వామి ధ్వజస్తంభం, విగ్రహ, పసిడి కలశ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం ఆదివారం జరగనుందని సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్ గొంప నాయనప్ప తెలిపారు. స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా వేకువజాము నుంచి నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: డిగ్రీ చదివిన విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నామని షీలానగర్‌లోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు తెలిపారు. వైద్య ఆరోగ్య రంగంలో నైపుణ్యాలను అందించే ఈ సర్టిఫికెట్ కోర్సుకు డిగ్రీ పాసైన లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏడాది వ్యవధి గల ఈ కోర్సులో ఆరు నెలల పాటు అభ్యర్థులకు స్టైఫండ్ అందిస్తామన్నారు. కోర్సు పూర్తి అనంతరం ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందిస్తామన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు డిప్లొమా, బీఎస్సీ, పారామెడికల్, నర్సింగ్, ఎంఎల్టీ, బీపీటీ, కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఈ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు 7995013421, 7995013422 నంబర్లలలో సంప్రదించాలని కోరారు.